నేడు బడ్జెట్‌పై సమావేశం

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 25: హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్‌పై సోమవారం సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రవాణాశాఖ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నట్లు చెప్పారు. పట్టణంలోని ప్రజలకు తడి, పొడిచెత్త బుట్టలను సైతం పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

రామకోటి పుస్తకం అందజేత

గజ్వేల్, ఫిబ్రవరి 25: రామకోటి రామరాజు ఆదివారం గజ్వేల్ ఏసీపీ బాలాజీకి ఆయన కార్యాలయంలో రామకోటి పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం తలపెట్టిన 1000కోట్ల లిఖిత రామకోటి మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడమే లక్ష్యమన్నారు.

భక్తిశ్రద్ధలతో షబే-బరాత్

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 25: మద్దూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో షబే-బరాత్ పర్వదిన వేడుకలను ఆదివారం ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. రోజంతా ఉపవాసం ఉండి మృతి చెందిన తమ పూర్వికుల సమాధుల వద్ద రాత్రి జాగారం చేసి ముస్లింలు ప్రత్యేక పార్థనలు చేశారు. మసీదుల్లో హఫీజ్‌లు ఖురాన్ సూక్తులను పఠించారు.

నేడు మంత్రి పొన్నం పర్యటన

హుస్నాబాద్, ఫిబ్రవరి 25: హుస్నాబాద్ నియోజకవర్గంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పర్యటించనున్నారు. ఉదయం మహ్మదాపూర్-మడద-హుస్నాబాద్ వరకు నిర్మించనున్న తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ, హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రం ప్రారంభం, హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ ప్రణాళిక సమావేశంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం పొట్లపల్లిలో స్వయంభూరాజేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం, రాత్రి హుస్నాబాద్ వైశ్యభవన్‌లో అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని పోలీసు అధికారులు తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్సై మధుకర్‌రెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మర్కూక్, ఫిబ్రవరి25: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మర్కూక్ ఎస్సై మధుకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దామరకుంటలో శనివారం రాత్రి పోలీస్ కళాబృందం సభ్యులు ప్రజల్లో చైతన్యం కల్పించే కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలు, బాణామతి,చేతబడిని నమ్మవద్దన్నారు. చిన్న చిన్న తగాదాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో చిన్నపిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగులు వచ్చాయని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి గ్యాంగులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. అలా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఆంజనేయులు, సంతోష్, పోలీస్ కళాబృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇక చెత్త కుప్పలకు చెక్

పేరుకుపోకుండా కార్యాచరణ రూపొందించిన మున్సిపల్ పాలకవర్గం

- డీఆర్‌సీ నుంచి నేరుగా పొడిచెత్త ఎగుమతి
- బేసిల్ ఫౌండేషన్‌తో మున్సిపల్ ఐదేండ్ల ఒప్పందం

హుస్నాబాద్‌లో మున్సిపల్ సిబ్బందికి చెత్త ఇస్తున్న మహిళ

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 25: హుస్నాబాద్ పట్టణంలో ఇక చెత్తకుప్పలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోకుండా మున్సిపల్ పాలకవర్గం కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే తడిచెత్తతో ఎరువు తయారుచేస్తున్న 'మున్సిపల్' పొడిచెత్తను సైతం ఎప్పటికప్పుడు ఎగుమతి చేసేందుకు నిర్ణయం తీసుకున్నది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం పొడిచెత్తను తీసుకువెళ్లే విధంగా సిద్దిపేటకు చెందిన బేసిల్ ఫౌండేషన్ తెలంగాణ సంస్థతో ఒప్పందం సైతం చేసుకుంది. దీంతో పొడిచెత్త గుట్టలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించేందుకు వీలు కలుగుతుంది.

51రకాల పొడి చెత్తసేకరణ

పట్టణంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను ఎప్పటికప్పుడు సేకరిస్తూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా మున్సిపల్ పాలకవర్గం ముందుకువెళ్తున్నది. ఇందులో భాగంగా పట్టణంలోని ఇండ్లు, దుకాణాలు, కార్యాలయాల నుంచి నిత్యం తడి, పొడి, హానికరమైన చెత్తను సేకరిస్తున్నారు. ఇప్పటికే తడిచెత్తతో ఎరువు తయారుచేస్తున్న మున్సిపల్ పాలకవర్గం పొడిచెత్తను సైతం నిరుపయోగం చేయకుండా తిరిగి ఉపయోగపడే విధంగా కృషిచేస్తున్నది. ముఖ్యంగా న్యూస్‌పేపర్లు, షాంపు ప్యాకెట్, నూనెప్యాకెట్, సబ్బు కవర్, పగిలిపోయిన గాజు సీసాలు, అట్టముక్కలు, ప్లాస్టిక్‌బాటిల్స్, బుక్స్, కురుకురే ప్యాకెట్లు, పాల ప్యాకెట్లు, క్లాత్, సిమెంట్ సంచులతో రిసైక్లింగ్‌కాని వాటితోపాటు 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న వాటితోపాటు దాదాపు 51రకాల పొడి చెత్తను పట్టణంలో చెత్తవాహనాల ద్వారా సేకరిస్తారు. ఇలా సేకరించిన వాటిని స్థానిక డీఆర్‌సీ కేంద్రానికి అక్కడి నుంచి బేసిల్ ఫౌండేషన్‌కు తరలిస్తారు.

బేసిల్ ఫౌండేషన్‌తో ఐదేండ్ల ఒప్పందం

బేసిల్ ఫౌండేషన్ తెలంగాణ సంస్థతో హుస్నాబాద్ మున్సిపాలిటీ ఐదేండ్లపాటు పొడిచెత్తను తీసుకువెళ్లేవిధంగా ఒప్పందం చేసుకుంది. పట్టణంలోని ఇరవై వార్డుల్లోని ఇండ్లు, కార్యాలయాల నుంచి సేకరించిన పొడిచెత్తను స్థానిక డీఆర్‌సీ కేంద్రానికి తరలిస్తారు. అక్కడి నుంచి బేసిల్‌ఫౌండేషన్ వారు ఈ పొడిచెత్తను తీసుకువెళ్లి వాటిని తిరిగి ఉపయోగించేవిధంగా కృషిచేస్తారు. రోజుకు 9.5మెట్రిక్ టన్నుల తడి, పొడి, హానికరమైన చెత్త పట్టణంలో ఉత్పత్తి అవుతుండగా ఇందులో రోజూ పొడిచెత్త 3మెట్రిక్‌టన్నుల మేరకు వస్తున్నట్లు మున్సిపల్ వర్గాలు అంచనావేశాయి. ఇందుకు స్థానిక మున్సిపల్ నిర్వహిస్తున్న డీఆర్‌ఎస్ కేంద్రం నిర్వాహకులకు ప్రోత్సాహం పేరిట కొంత నగదు చెల్లిస్తారు. అలా చెల్లించిన నగదును చెత్తవాహనాలను నడిపించే మున్సిపల్‌డ్రైవర్లకు అందించి పొడిచెత్తను పూర్తిగా సేకరించేందుకు కృషిచేస్తారు. డంప్‌యార్డుల అవసరం లేకుండా కృషి చేయడమే ఈ సంస్థ లక్ష్యం.

సేకరించిన పొడిచెత్త

హుస్నాబాద్‌ను శుభ్రంగా తీర్చిదిద్దుతాం

గుట్టలు గుట్టలుగా చెత్త నిల్వ ఉండకుండా చేయడమే లక్ష్యంగా పాలకవర్గం ప్రయత్నాలు చేస్తున్నది. హుస్నాబాద్‌ను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యం. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని చెత్తకుప్పలుగా మారకుండా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్‌కు భారం కాకుండా పొడిచెత్తను ఎగుమతి చేసేందుకు బేసిల్ ఫౌండేషన్ సంస్థతో ఒప్పందం చేసుకున్నాం.

– ఆకుల రజితావెంకన్న, చైర్‌పర్సన్, మున్సిపల్ హుస్నాబాద్

డంప్ యార్డులు లేకుండా చేయడమే ముఖ్య ఉద్దేశం

పట్టణంలో డంప్ యార్డులు లేకుండా చేయడమే బేసిల్‌ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం. ఈ సంస్థతో ఒప్పందం చేసుకోవడంతో హుస్నాబాద్ పరిశుభ్రంగా ఉంటుంది. ప్రజలు సైతం చెత్తను వేరు చేసి చెత్త వాహనాలకు ఇవ్వాలి. చెత్త వాహనాలకు పొడిచెత్త ఇచ్చి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి.

– టి.మల్లికార్జున్‌గౌడ్, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్

చెత్తలో ఏది ఉన్నా తీసుకుపోయే బాధ్యత మాదే

హుస్నాబాద్‌లో ఎటువంటి పొడి చెత్త ఉన్నా తీసుకుపోయే బాధ్యత మాదే. రీసైకింగ్ అయ్యే వాటిని రీసైకింగ్ చేయడంతో పాటు కాని వాటిని సైతం తీసుకువెళ్తాం. హుస్నాబాద్ చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు మా వంతు కృషి చేస్తాం. ఇప్పటికే సిద్దిపేటలో మూడేండ్ల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. హుస్నాబాద్ నుంచి ఎప్పటికప్పుడు పొడిచెత్తను వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్లి ఉపయోగించేందుకు కృషి చేస్తాం.

–సుద్దాల ఉదయ్. బేసిల్ ఫౌండేషన్ తెలంగాణ సంస్థ పౌండర్, సిద్దిపేట

అంబటి మహేశ్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

పలు కుటుంబాలకు హరీశ్‌రావు పరామర్శ

సిద్దిపేట, ఫిబ్రవరి 25: సిద్దిపేట నియోజకవర్గంలో పలు కుటుంబాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జంగిటి నర్సింహులు తల్లి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. తడకపల్లికి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం సీనియర్ నాయకుడు అంబటి మహేశ్‌గౌడ్ కూతురు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సిద్దిపేట పట్టణానికి చెందిన యువజన విభాగం నాయకుడు చేపూరి శేఖర్‌గౌడ్ తండ్రికి ఇటీవల గుండె ఆపరేషన్‌కాగా శంకర్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.



హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అనంతగిరిపల్లి యాదవసంఘం నాయకులు

హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత

గజ్వేల్, ఫిబ్రవరి 25: వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో సోమవారం నుంచి మూడు రోజులు జరిగే మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు ఆదివారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను యాదవ సంఘం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

వర్గల్, ఫిబ్రవరి 25: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని గజ్వేల్ ఏసీపీ బాలాజీ ఆదేశించారు. ఆదివారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మింగా తనిఖీ చేసి పరిసరాలను కలియతిరిగారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే అర్జీదారులపట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, ఇతర నేరాలపై అప్రమత్తంగా ఉంటూనే ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ బాలాజీ

పేదలకు చేరువగా అలయన్స్ క్లబ్ సేవలు

- అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వనజ
- 27న వనమాలి విజయోత్సవం సభ

సమావేశంలో మాట్లాడుతున్న సోమ వనజ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 25: అవసరం ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి అలయన్స్ క్లబ్ సభ్యులు పేదలను ఆదుకుంటారని సిద్దిపేట అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సోమ వనజ అన్నారు. అలయన్స్ క్లబ్ గవర్నర్‌గా 10 నెలలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న వనమాలి విజయోత్సవ సభను సిద్దిపేటలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆమె మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అలయన్స్ క్లబ్ ద్వారా సమాజంలో ఉత్తమ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు ఎనిమిది మంది నిరుపేదలకు వివాహాలు జరిపించామని, సామూహిక సీమంతాలు, రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు, నిరుపేదలకు పుస్తెమట్టెల పంపిణీ ఇలా మొత్తం పది నెలల్లోనే 400 సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లాలోని అలయన్స్ క్లబ్ పరిధిలో 16 క్లబ్‌లు సేవలు అందిస్తున్నాయని, వారందరినీ అభినందిస్తూ విజయోత్సవంలో అవార్డులు అందించనున్నామన్నారు. అవార్డుల ప్రదానోత్సవానికి అలయన్స్ క్లబ్ జాతీయ స్థాయి ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి నేతలు హాజరవుతారన్నారు. సమావేశంలో అలయన్స్‌క్లబ్ ప్రతినిధులు, ఆత్మరాములు, పెద్ది వైకుంఠం, అంతయ్య, అంజయ్య, ఆంజనేయులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 25: విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని ఇండియా లిటరసీ ప్రాజెక్టు మండల కేరియర్ మహర్షి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అందె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఇండియా లిటరసీ కెరీర్ గైడెన్స్ వారి ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మహర్షి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 250 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఎలా రాయాలనే విషయంపై సూచనలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మర్కూక్‌లోని పాండురంగస్వామిని దర్శించుకున్న యోగా గురువు భిక్షమయ్య

పాండురంగస్వామిని దర్శించుకున్న యోగా గురువు

మర్కూక్, ఫిబ్రవరి 25: మండలంలోని పాండురంగాశ్రమాన్ని ప్రముఖ యోగా గురువు భిక్షమయ్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పూజారులు పాండురంగాశ్రమ ఆలయ చరిత్ర, వందేండ్ల క్రితమే ఇక్కడ భక్తిపారవశం వెల్లివిరిసిందని ఆయనకు వివరించారు. గ్రామాల్లో నిస్వార్థంగా భజన మండలులు స్థాపించడం మామూలు విషయం కాదని ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

తొగుట, ఫిబ్రవరి 25: మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎండీ చాన్ భార్య శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డిపేట ఎంపీటీసీ వెల్పుల స్వామి ఆదివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, బూత్ అధ్యక్షుడు భాస్కర్, కనకరాజు, ఉపాధ్యక్షుడు ఎల్లాగౌడ్, బాల్‌రాజ్ ఉన్నారు.

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుపై టీఎన్జీవోల హర్షం

సిద్దిపేట, ఫిబ్రవరి 25: ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు శ్రీధరబాబు,పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడంపై టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రమ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో అదివారం వారు మాట్లాడారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అమలులో భాగంగా ఉద్యోగుల శాశ్వత కేటాయింపుకోసం జీవో 317 ద్వారా పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. క్యాడర్‌లో జూనియర్ అయినందుకే సొంత జిల్లాలు కాకుండా ఇతర జిల్లాలకు కేటాయించబడ్డారన్నారు. భార్యా భర్తలను వేర్వేరు జిల్లాలకు కేటాయించారన్నారు. పూర్వ సర్వీసును వదులుకుని అంతర్ జిల్లా బదిలీ ద్వారా వచ్చిన భార్యాభర్తలు కూడా తిరిగి వేరుచేయబడ్డారన్నారు. ఉపసంఘం అధ్యయనం చేసి సత్వరమే సానుకూల పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ కరుణాకర్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

చేర్యాల, ఫిబ్రవరి 25: చదువుతో పాటు యువత క్రీడల్లో రాణించాలని చేర్యాల ఎంపీపీ కరుణాకర్ అన్నారు. మండలంలోని నాగపురిలో ఆదివారం నాగపురి ప్రీమియం లీగ్ సీజన్-2లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్స్ ముగిశాయి. తుదిపోరులో నాగపురి, చుంచనకోట జట్లు తలపడగా చుంచనకోట జట్టు ప్రథమ, నాగపురి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 25వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15వేలను మాజీ సర్పంచ్ సంతోష్‌కుమార్‌తో కలిసి ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్స్ సహాయకులు గూడెపు మహేశ్, సత్యనారాయణగౌడ్, నిర్వాహకులు బాలకిషన్, కరణ్, ప్రతాప్, రాజు, శ్రీకాంత్, భాస్కర్, ప్రవీణ్, కరుణాకర్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా సమాఖ్య ట్రాక్టర్

మద్దూరు మండల సమాఖ్య కార్యాలయం ఎదుట నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్

- లీజుకు తీసుకునేందుకు రైతుల విముఖత

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 25: ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జిల్లాలోని పలు మండల సమాఖ్యల ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారి నష్టాలను మిగుల్చుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి మద్దూరు మండంలోని జాగృతి మండల సమాఖ్య ద్వారా గతేడాది కేంద్రం అందించే రూ. 2లక్షల 40వేల రాయితీ డబ్బులకు అదనంగా రూ. 9లక్షల 20వేలు కలిపి మొత్తం 11లక్షల 60వేలతో డోజర్, ప్లవ్‌తో కూడిన ట్రాక్టర్ కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన ఓ వ్యక్తికి నెలకు రూ.20వేల చొప్పున లీజుకు ఇచ్చారు. ఆరు నెలల పాటు ట్రాక్టర్‌ను లీజుకు నడుపుకొన్న సదరు వ్యక్తి తనకు గిట్టుబాటు కావడం లేదని తిరిగి ట్రాక్టర్‌ను మండల సమాఖ్యకు వాపస్ పంపాడు. దీంతో గతేడాది అక్టోబర్ నుంచి మండల సమాఖ్య కార్యాలయం ఎదుట ట్రాక్టర్ నిరుపయోగంగా ఉంటుంది. లీజు అమౌంట్ తగ్గిస్తే మండలంలోని రైతులు, కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ అలాంటి చర్యలు ఏమీ తీసుకోకుండా ఐకేపీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరు నెలల నుంచి ఖాళీగా ఉండడం వల్ల ట్రాక్టర్ పాడవడమే కాకుండా మండల సమాఖ్యకు నష్టాలు మిగుల్చుతుంది. ఈ విషయమై ఏపీఎం బాబురావును వివరణ కోరగా ట్రాక్టర్ లీజుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు తెలిపారు.

విద్యార్థికి అభినందనల వెల్లువ

దుబ్బాక, ఫిబ్రవరి 25: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పీఎన్ఎం పాఠశాలలో ఆదివారం రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత విభాగంలో (మ్యాథ్స్‌లో) దుబ్బాక గాయత్రి వివేకానంద విద్యాలయానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి కె.యశ్వంత్ తృతీయ బహుమతి సాధించారు. విద్యార్థి యశ్వంత్, శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయురాలు నవీలతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేశ్, రేణుక, భానుచందర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్‌బీఐ పేరిట మెసేజ్‌లు చక్కర్లు

వాట్సాప్ గ్రూపుల్లో లింక్‌లను ఓపెన్ చేసిన పలువురి అకౌంట్ల నుంచి డబ్బులు మాయం

- మెసేజ్‌లకు బెంబేలెత్తిపోతున్న జనం

చేర్యాల, ఫిబ్రవరి 25: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)రివార్డ్స్ పేరిట పలు వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన మెసేజ్‌లకు చేర్యాల ప్రాంతంలోని మొబైల్ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. శనివారం సాయంత్రం నుంచి చేర్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురి వాట్సాప్‌లను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు అవ్యక్తుల ప్రమేయం లేకుండానే వివిధ గ్రూపుల్లో ఎస్‌బీఐ రివార్డ్స్ పేరిట ఫేక్ మెసేజ్‌లను వైరల్ చేశారు. వాట్సాప్‌లల్లో వస్తున్న మెసేజ్‌లు ఫేక్ అని తెలుసుకోలేని కొంతమంది యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని వారి అకౌంట్లలో ఉన్న డబ్బులను పోగొట్టుకున్నట్లు సమాచారం. దీనికితోడు సైబర్ నేరగాళ్లు ఎస్‌బీఐ రివార్డ్స్ పేరుతో వందలాది గ్రూపుల్లో చొరబడి గ్రూపుల ప్రొఫైల్ పిక్‌లను మార్పుతున్నారు. మరికొన్ని గ్రూపుల్లో వ్యక్తులు, సంస్థల పేరుతో స్కానర్లు తయారు చేసి వాటిని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి డబ్బులు కాజేస్తున్నారు.ఈ విషయమై పలువురు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఎస్‌బీఐ పేరిట వాట్సాప్ గ్రూపులో చక్కర్లు కొడుతున్న ఫేక్ యాప్



ఎస్‌బీఐ పేరిట వాట్సాప్‌లో వైరల్ అవుతున్న స్కానర్లు

గ్రామపంచాయతీకి రిఫ్రిజిరేటర్ అందజేస్తున్న కోఆప్షన్ సభ్యుడు లాల్‌భాగన్

గ్రామపంచాయతీకి రిఫ్రిజిరేటర్ అందజేత

కొమురవెల్లి, ఫిబ్రవరి 25: కొమురవెల్లి గ్రామపంచాయతీకి ఆదివారం మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ.లాల్‌భాగన్ డిస్పెన్సర్ రిఫ్రిజిరేటర్ అందజేశాడు. వేసవి దృష్ట్యా గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు ప్రజల సౌకర్యం కోసం రిఫ్రిజిరేటర్ అందజేశానని, ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని లాల్‌భాగన్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకేశ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనం

బెజ్జంకి, ఫిబ్రవరి 25: మండలంలోని వడ్లూర్ బేగంపేట ఉన్నత పాఠశాల 1994-95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉత్సాహంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.